రేషన్ షాపుల్లో జొన్న, మొక్కజొన్న

- బహిరంగ మార్కెట్‌లో వేలం వేయకుండా ప్రజలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచన
- పేదలకు పౌష్టికాహారం.. మధ్యవర్తుల దందాకు చెక్ • రైతు పక్షపాతిగా మొక్కజొన్న, జొన్న రైతులకు ప్రభుత్వం అండ: డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రభుత్వం మరోసారి భరోసానిచ్చింది. మొక్కజొన్న, జొన్న పంటలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, సేకరించిన ధాన్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు రేషన్ దుకాణాల ద్వారా నేరుగా పేద ప్రజల చెంతకు చేర్చేలా చారిత్రాత్మక నిర్ణయమని డిప్యూటి సిఎం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటలను బహిరంగ మార్కెట్‌లో వేలం వేసి మధ్యవర్తులకు లాభం చేకూర్చకుండా, సివిల్ సప్లై శాఖ ద్వారా రేషన్ షాపుల లో పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. పంట పండించిన రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో మొక్కజొన్న, జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసిన విషయాన్ని డిప్యూటి సిఎం గుర్తు చేశారు. ఈ క్రమంలో మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాధారణంగా ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తుందని, దీన్ని అదునుగా తీసుకుని మధ్యవర్తులు తక్కువ ధరకే దక్కించుకుని లాభపడుతుంటారని, ఈ దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ, సేకరించిన ధాన్యాన్ని ప్యాకింగ్ చేయించి నేరుగా ప్రజలకు తక్కువ ధరకు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోన్నట్లు డిప్యూటి సిఎం తెలిపారు. ధాన్యం కేవలం మార్కెట్ సరుకుగా మిగిలిపోకూడదని అది పేదవాడి ఆకలి తీర్చే పౌష్టికాహారంగా మారాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు.

గురుకులాలు, హాస్టళ్లకు పౌష్టికాహారం

ప్రభుత్వ నిర్ణయం వల్ల కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే వేలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుందని డిప్యూటి సిఎం తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించేలా మొక్కజొన్న, జొన్నల సరఫరాకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు పౌల్ట్రీ రైతులకు అవసరమైన మేరకు కూడా సరఫరా చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు.

హైడ్రా ప్రజావాణికి 4 వారాల విరామం

పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

మన తెలంగాణ/సిటీబ్యూరో: ప్రతి సోమవారం హైడ్రా నిర్వహిస్తున్న ప్రజావాణికి 4 వారాలు విరామం ప్రకటించామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో పారదర్శకత, జవాబుదారీత నం ఉండేలా హైడ్రా చూస్తుందని కమిషనర్ ఏవి రంగనాథ్ పేర్కొన్నారు. ఫిర్యాదుల విచారణలో తగిన అధికారిక ఆధారాలు లభించినప్పుడు మాత్రమే చట్టానికి లోబడి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల నుండి వేలాదిగా వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని.. ప రిష్కరించగా మిగిలి ఉన్న ఫిర్యాదులను కూ డా పరిష్కరించే క్రమంలో జాప్యం చేయకూడదని నిర్ణయించామని కమిషన్ తెలిపారు. 4 వారాలు ప్రజావాణి కార్యక్రమానికి హైడ్రా విరామం ఇచ్చినట్టు రంగనాథ్ వెల్లడించారు.

రాజకీయ పునరావాస కేంద్రాలుగా కార్పొరేషన్లు

- నిధులు విడుదల చేయకుండా నిర్వీర్యం • పదవులు ఇవ్వడంలో ఉన్న శ్రద్ధ, పైసలు ఇవ్వడంలో లేదు • కార్పొరేషన్ వ్యవస్థను కాంగ్రెస్ దెబ్బతీస్తోంది • 33 కార్పొరేషన్‌లకు రూ.14,521 కోట్లు కేటాయించి, విడుదల చేసింది రూ.3,198 కోట్లు మాత్రమే
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

మనతెలంగాణ/హైదరాబాద్: నిధులు ఇవ్వకుండా కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తే ఏం లాభమని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ, నిధులు విడుదల చేయడంలో లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు, విధులు లేకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు. కార్పొరేషన్లను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి ఏం సాధిస్తారని ఆయన మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి సంక్షేమంపై దృష్టి కంటే, అనుచరులను సంతృప్తి పరచడం పైనే ఆయన దృష్టి సారించారని హరీష్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 17 కార్పొరేషన్లకు చైర్‌పర్సన్లు ప్రకటించడంపై హరీశ్ రావు బుధవారం స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 33 కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మరి కొందరికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

వినియోగించిన నిధులు రూ.305 కోట్లు మాత్రమే..

నిధులు విడుదల చేయకపోవడంతో, మొదటి దఫాలో నియమితులైన చైర్మన్లు ప్రజలకు ఒక్క రూపాయి కూడా సాయం చేయకుండా వారి పదవీకాలాన్ని ముగించారని ఆయన గుర్తు చేశారు. 33 కార్పొరేషన్లకు గాను 21 కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా అసలు ఉద్దేశ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. మాల, మాదిగ, సంతు సేవాలాల్, కొమురం భీం, ఏకలవ్య, మైనార్టీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించడం వారి పట్ల చూపుతున్న వివక్షకు నిదర్శనమన్నారు. ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, కుమ్మరి, విశ్వ బ్రాహ్మణ, మేదర, వాల్మీకి, బోయ తదితర కార్పొరేషన్లకు కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇలా మొత్తంగా 33 కార్పొరేషన్లకు గాను ఇప్పటి వరకు రూ.14,521 కోట్లు కేటాయించగా, విడుదల చేసింది రూ.3198 కోట్లు మాత్రమే అని, వినియోగించింది రూ.305 కోట్లు మాత్రమే అనిపేర్కొన్నారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తే, ప్రభుత్వం నుంచి సరైన సమాధానం లేదన్నారు. రేవంతు పాలనలో కుల వృత్తులను ఆదుకునే ఏ పథకం లేకేపోగా, కెసిఆర్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలన్నీ స్తంభించి పోయాయన్నారు. వారి ఆవేదన అరణ్య రోదనగా మిగిలిపోయిందని వాపోయారు. నిధులు లేని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి చేతులు దులుపుకోవడం మానేసి, ఆయా కులాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, వినియోగించాలని, బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టు తాడి ప్రకాష్‌కి ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అవార్డు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రముఖ జర్నలిస్టు, రచయిత తాడి ప్రకాష్ 2026వ సంవత్సరం చందు సుబ్బారావు లిటరరీ ట్రస్ట్ అవార్డుకు ఎంపిక అయ్యారు. ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్ట్ చైర్మన్ పూర్వ యు.పి.ఎ.సి సభ్యులు ప్రొఫెసర్ కె. ఎస్. చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు బుధవారం ఈ విషయం ప్రకటించారు. ప్రకాష్‌కి నగదు అవార్డు ప్రదానం చేసే సభకి ప్రొఫెసర్ చలం అధ్యక్షత వహిస్తారు. ప్రసిద్ధ రచయితలు అట్టాడ అప్పలనాయుడు, జిఎస్ చలం, సీనియర్ జర్నలిస్ట్ వి.వి. రమణమూర్తి ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు. చందు 80వ జన్మదిన సందర్భంగా ఈ నెల 18న ఉదయం 10 గంటలకు విశాఖపట్నం ద్వారకా నగర్‌లోని పౌర గ్రంథాలయం హాలులో ఈ సభ జరుగుతుంది. జర్నలిస్టు జ్ఞాపకాలతో తాడి ప్రకాష్ రాసిన 'ఏలూరు రోడ్డు ఆత్మ గీతం' పుస్తకం అందరి మన్ననలు పొందింది. ప్రతిష్టాత్మకమైన ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అవార్డును గతంలో ప్రజావాగ్గేయకారులు వంగపండు ప్రసాద్, గోరటి వెంకన్న, కవులు శిఖామణి, కొలకలూరి ఇనాక్, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావులకు బహుకరించారు. 18వ తేదీ సభకి జర్నలిస్టులు, రచయితలు, కవులు హాజరు కావాలని ప్రొఫెసర్ చలం, ఉప్పల అప్పలరాజు కోరారు.

పోలీస్ కమిషనర్‌కే రక్షణ లేకపోతే, సామాన్యుల పరిస్థితి ఏమిటి?

మన తెలంగాణ/హైదరాబాద్ : మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి నిర్వహించిన 'అర్ధరాత్రి డెకాయ్ ఆపరేషన్' లో వెలుగు చూసిన భయం కర నిజాలపై బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఎంఎల్‌సి డాక్టర్ దాసోజు శ్రవణ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక ఉన్నత స్థాయి ఐపిఎస్ అధికారిణికి, అది కూడా నగర నడిబొడ్డున 40 మంది పోకిరీల నుంచి వేధింపులు ఎదురయ్యాయంటే, ఈ పాలనలో మహిళల భద్రతను పాతాళానికి తొక్కేసారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

యువత నైపుణ్యాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం
- మహిళల ఆర్థిక సాధికారతకు కుట్టు శిక్షణ కేంద్రాలు, గార్మెంట్స్ యూనిట్

మన తెలంగాణ/మంథని: యువత నైపుణ్యాభివృద్ధితోనే తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలతో కలిసి మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను పెంపొందించాలనే లక్ష్యంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కేంద్రం ద్వారా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మల్టీమీడియా, ఆడియో విజువల్ రంగాల్లో శిక్షణ అందించబడుతుందని పేర్కొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సిఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ సంస్థ సహకారంతో యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంథని వంటి ప్రాంతాలకు పరిశ్రమలను తీసుకురావడం సవాలుతో కూడుకున్నదని, ఇక్కడి యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందగలరని అన్నారు. గంగాపురిలో రూ.7.3 కోట్ల వ్యయంతో ప్లగ్ అండ్ ప్లే గార్మెంట్స్ యూనిట్‌కు ఈరోజు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత ఒకేసారి 400 మంది మహిళలకు శిక్షణ అందించవచ్చని, ఇది విజయవంతమైతే మరో యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

మూడేండ్ల ఎదురుచూపులకు తెర

- ఏఎన్‌ఎం పోస్టుల నియామకాలకు తొలగిన అడ్డంకులు • కోర్టు చిక్కులు వీడడంతో ఫలితాల విడుదలకు సిద్ధమైన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు • మూడు రోజుల్లో ఏఎన్‌ఎం పోస్టుల ఫలితాలు



మన తెలంగాణ/హైదరాబాద్: మల్టీ పర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ (ఏఎన్ఎం) పోస్టుల భర్తీకి అడ్డంకులు తొలగిపోయాయి. కోర్టు కేసులు పరిష్కారం కావడంతో ఫలితాల విడుదలకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు సిద్ధమవుతోంది. మరో 3 రోజుల్లో ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని బోర్డు అధికారులు బుధవారం వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియామకాలకు సంబంధించి కోర్టుల్లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తూ ఆరోగ్యశాఖలో నియామకాలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఇప్పటికే 12,649 పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. ఏఎన్ఎం పోస్టులకు సంబంధించి హైకోర్టు సింగిల్ బెంచ్ వద్ద ఉన్న కేసులోనూ ప్రభుత్వం నియామకాలు ఆపోద్దని వాదనలు బలంగా వి నిపించింది. ఈ క్రమంలోనూ కోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు 2024 డిసెంబర్‌లో ఏఎన్ఎం పోస్టులకు రాత పరీక్ష నిర్వహించింది. కానీ, కోర్టులో కేసు ఉండడంతో తుది ఫలితాలను వెల్లడించలేకపో యింది.

ఈ కేసులో ఇటీవలే కోర్టు తుది తీర్పును ఇచ్చింది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 20 శాతానికి మించి వెయిటేజీ ఇవ్వడానికి వీల్లేదని స్పష్టం చేసింది. గతంలో వివిధ కేసుల్లో సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పులను కూడా ప్రస్తావించింది. కోర్టు తీర్పు నేపథ్యంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలో నియామక బోర్డు న్యాయశాఖను న్యాయ సలహా కోరింది. గతంలో ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు, ప్రస్తుత కేసులో ఇచ్చిన తీర్పు ప్రకారం 20 శాతానికి మించి వెయిటేజీ ఇస్తే మళ్లీ న్యాయపరమయిన సమస్యలు తలెత్తి, నియామక ప్రక్రియ ప్రమాదంలో పడుతుందని న్యాయశాఖ సూచించింది. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు ప్రకారం 20 శాతం వెయిటేజీ ఇచ్చి, రిక్రూట్‌మెంట్ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల ఈ అంశంపై రివ్యూ చేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వీలైనంత త్వరగా ఫలితాలు విడుదల చేసి, భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో 1931 పోస్టులకు సంబంధించిన పోస్టుల ఫలితాల విడుదలకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమవుతోంది. 2023 ఎన్నికల ముందు నోటిఫికేషన్ విడుదల కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 డిసెంబర్‌లో రాత పరీక్ష జరిగింది. సుమారు 25 వేల మంది ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోగా, 20,600 మంది పరీక్షకు హాజరయ్యారు. సుమారు మూడు సంవత్సరాలుగా వీరంతా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. కోర్టు తీర్పు, ప్రభుత్వం నిర్ణయంతో వీరి ఉద్యోగ ఆకాంక్షలు త్వరలో నెరవేరనున్నాయి. ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 12,649 ఉద్యోగాలు భర్తీ చేసింది. 1931 ఏఎన్ఎం పోస్టుల రిక్రూట్ మెంట్ పూర్తయితే, రేవంత్ సర్కార్ భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య 14,580కి చేరుతుంది.

కేసు నేపథ్యం

ఆరోగ్యశాఖలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేస్తామని రాష్ట్ర ఉద్యమ సమయంలో, 2014 మేనిఫెస్టోలో (అప్పటి టిఆర్ఎస్)బిఆర్ఎస్ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆ హామీని నిలుపుకోలేకపోయింది. ఈ క్రమంలో ఏఎన్ఎంలు రకరకాలుగా గత సర్కార్‌పై తమ నిరసన తెలియజేశారు. పలుమార్లు సమ్మెలు చేశారు. 2023లో ఏఎన్ఎంల నిరసనలు తీవ్రం అయ్యాయి. దీంతో 2023 ఎలక్షన్లకు మూడు నెలల ముందు, ఏఎన్ఎం పోస్టుల భర్తీకి గత సర్కార్ నోటిఫికేషన్ ఇచ్చింది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలను బుజ్జగించేందుకు వారికి 30 మార్కుల వెయిటేజీ ఇస్తామని నోటిఫికేషన్‌లో ప్రకటించింది. దీంతో నిరుద్యోగ (నాన్ సర్వీస్) ఏఎన్ఎంలు కోర్టుకు వెళ్లారు. 30 మార్కులు ఇవ్వడం చట్ట విరుద్ధం అని, వెయిటేజీని పూర్తిగా తీసివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీంతో నియామకాలకు బ్రేకులు పడ్డాయి.

భూపాలపల్లిలో భారీ వర్షం.. కేంద్రాల్లో తడిసిన ధాన్యం

నేలకొరిగిన పంటలు

మన తెలంగాణ/భూపాలపల్లి జిల్లా ప్రతినిధి: భూపాలపల్లి జిల్లా పలు మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి పలు మండలాల్లో నిధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం తడిసి వరుదలకు కొట్టుగపోగా, వరి పంట నేల కొరిగింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంతోపాటు, కాటారం, మల్హార్‌రావు, మహదేవ్‌పూర్, మహాముత్తారం, పలిమెల మండలా ల్లో వర్షం కురిసింది. అత్యధికంగా మల్హార్ రావు మండలంలో 58.6ఎంఎం వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 20.1ఎంఎం వర్షాపాతం నమోదైంది. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం తడిసిపోయింది. చేతికొచ్చిన వరి నేలపాలు కావడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. తడిసిన ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు.

వంటగ్యాస్ కార్మికుల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తాం

కార్మిక శాఖ కార్యదర్శి హామీ

మన తెలంగాణ/హైదరాబాద్ : వంట గ్యాస్ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను నెల రోజులలోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన హామీ ఇచ్చారు. బుధవారం తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సలహాదారు కమిటీ చైర్మన్, మాజీ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు, కమిటీ నాయకు లు చామకూర రాజు, అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శు లు అజయ్‌రెడ్డి, నగేష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు యునుస్ తదితరులు సచివాలయంలో కార్మిక శాఖ కార్యదర్శి హరిచందనను కలిసి ఎల్‌పిజీ డెలివరీ బాయ్స్ సమస్యలను విన్నవించారు. ఎల్‌పిజీ డిస్ట్రిబ్యూటర్లు సిలిండర్లు సరఫరా చేసే కార్మికులకు కనీస జీతాలు చెల్లించ డం లేదని, ఈఎస్ఐ, పిఎఫ్‌లు ఇవ్వడం లేదని చిరంజీవులు కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని, వారు కార్మిక శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల నియమాలను పాటించకుండా కార్మికుల శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, అపాయింట్‌మెంట్ లెటర్లు కూడా ఇవ్వడం లేదని, ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా తొలగిస్తున్నారని, వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదని అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కార్మికుల సమస్యలపై స్పందించిన కార్యదర్శి హరిచందన, డిస్ట్రిబ్యూటర్లకు కార్మిక శాఖ తరపున నోటీసులు పంపిస్తామని, డిస్ట్రిబ్యూటర్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నెల రోజుల లోపు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

RASMECCC - మహబూబ్‌నగర్, ఎర్రసత్యం చౌరస్తా, మహబూబ్‌నగర్ జిల్లా.

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ (3)తో చదవబడు సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

ఈ నోటీసు ద్వారా క్రింద తెలిపిన రుణగ్రహీత/లు, సహరుణగ్రహీత మరియు హామీదారులకు తెలియజేయడమేమనగా బ్యాంకు నుండి పొందిన రుణసదుపాయములపై అసలు మరియు వడ్డీ చెల్లించుటలో విఫలమైనందున మీ రుణఖాతాలను నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ)గా వర్గీకరించడమైనది. కావున సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద ఆఖరిగా తెలియజేసిన చిరునామాలపై వారికి నోటీసు జారీ చేసారు. కాని అవి బట్వాడ కాకుండానే మాకు తిరిగి వచ్చినవి. కావున బహిరంగ నోటీసు రూపములో వారికి తెలియజేయడమైనది.

క్ర. సం.	రుణగ్రహీతల పేరు/ నోటీసు తేది/ ఎన్‌పిఎ తేది	అమలు చేయబోతున్న ఆస్తుల వివరాలు/ సెక్యూర్డ్ ఆస్తుల చిరునామా	రావలసిన బకాయి మొత్తం
1	1. శ్రీమతి పద్మ అన్నపూర్ణ భర్త. ఎం వి సత్యనారాయణ, 2. శ్రీ ఎం.వి. సత్యనారాయణ తండ్రి. శ్రీ ఎం.వి. తిమ్మయ్య, నివాస చిరునామా: ఇం.నెం.1-14, మద్దూవర్ గ్రామం, మక్తల్, మహబూబ్‌నగర్-509208, హామీదారు: శ్రీ జి.వాల్ రెడ్డి తండ్రి. శ్రీ గవినోళ్ల గిరారెడ్డి, ఇం.నెం.4-141/12, శంభు కాలనీ, మక్తల్, మహబూబ్ నగర్ - 509208 వ్యాపార చిరునామా: శ్రీ ఎం.వి. సత్యనారాయణ తండ్రి. శ్రీ ఎం.వి. తిమ్మయ్య, యజమాని: మెస్సర్స్. శ్రీ సాయి రాఘవేంద్ర బ్రదర్స్, డి.నెం. 4-111/2 కేరాఫ్ శ్రీ సాయి ఫుట్ వర్స్, రాఘవేంద్ర కాలనీ, హనుమాన్ టెంపుల్ దగ్గర, సంగం బండ రోడ్, మక్తల్-509208. ఖాతా నెం.లు 62277422017, 62277422153 డిమాండ్ నోటీసు తేది: 16.04.2026 ఎన్‌పిఎ తేది: 15.04.2026 బ్రాంచ్: ఎసిబి మక్తల్ (20197)	రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1701/2005 తేది.18.11.2005 మరియు రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1317/2007 తేది.11.06.2007 ప్రకారం శ్రీమతి వి.అన్నపూర్ణ భర్త. వి.సత్యనారాయణ పేరున ఉండి ఎస్ఆర్ఓ, మక్తల్ వద్ద రిజిస్టర్డ్ చేయబడి తెలంగాణ రాష్ట్రం, నారాయణపేట జిల్లా-509351, మక్తల్ గ్రామం & మండలం, ఎల్లంకుంట, దత్తసాయి నగర్ కాలనీ వద్దగల 400 చ.గ.ల విస్తీర్ణం (200 చ.గ.లు + 200 చ.గ.లు) లేదా 334.44 చ.మీ.లు (167.22 చ.మీ.లు + 167.22 చ.మీ.లు) విస్తీర్ణం, సర్వే నెం.41/ఎ/2 లో ప్లాట్ నెం.14 & 15 పై నిర్మించబడిన గృహము యావదాస్తి. ప్లాట్ నెం. 14 సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం.13, దక్షిణం: ప్లాట్ నెం.15, పశ్చిమం: 25' వెడల్పు రోడ్డు, పడమర: మణికంఠ కాలనీ, ప్లాట్ నెం.15 సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం.14, దక్షిణం: ప్లాట్ నెం.16, పశ్చిమం: 25' వెడల్పు రోడ్డు, పడమర: మణికంఠ కాలనీ.	రావలసిన బకాయి మొత్తం తేది. 16.04.2026 నాటికి రూ. 9,90,614/- + దానిపై వడ్డీ, ఛార్జీలు & అనుషంగిక వ్యయాలు

నోటీసు ప్రత్యామ్నాయ సర్వీసు కొరకు చర్యలు తీసుకోబడినవి. కావున పైన తెలిపిన రుణగ్రహీత(లు) మరియు/లేదా వారి హామీదారు(లు) (వర్తించు విధంగా) లను కోరదమేమనగా ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా బకాయి మొత్తమును చెల్లించమని కోరుతూ, విఫలమైనచో ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) క్రింద తదుపరి చర్యలు చేపట్టబడును.

తేది: 06.05.2026, ప్రదేశము: మహబూబ్‌నగర్ అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పంజాబ్ నేషనల్ బ్యాంక్ punjab national bank

అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ హైదరాబాద్
6-3-865, మై హోమ్ జూపల్లి అమీర్‌పేట్, గ్రీన్ ల్యాండ్స్, గ్రాన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016. ఇ-మెయిల్ : cs4732@pnb.bank.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్